www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 5 జనవరి 2025

90 పశువులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని పాలతోడు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరంలో 90 పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఈ పశువైద్యశిబిరాన్ని ప్రారంభించారు. పశు వైద్యులు డాక్టర్ ఆర్.రాజ్ కుమార్, డాక్టర్ ఎస్. సతీష్‌లు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఎంఎల్‌ఎ వేగుళ్ళ చేతులమీదుగా రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లా వెంకట లక్ష్మి, పాలతోడు నీటి సంఘం ఛైర్మన్ బొబ్బిలి నాగేశ్వరరావు, నాయకులు పిల్లా తాతాలు, గుణ్ణం సత్యసాయిబాబు, అన్నందేవుల సూర్యచంద్రరావు, నీటిసంఘం డైరెక్టర్ యేలేటి వెంకట్రావు, దొడ్డ రాంబాబు, వల్లూరి అబ్బు, సరాకుల అబ్బులు, పిల్లా శ్రీనివాస్, కోడి సుబ్రహ్మణ్యం, పాడి రైతులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభలకు సిద్ధం

- పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు
- ప్రజా చైతన్య, విద్యా, సాహిత్య, మహిళా సదస్సులు
- మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు హాజరు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 17వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలు (స్వర్ణోత్సవ మహాసభలు) ఆదివారం నుంచి కాకినాడలో నాలుగు రోజుల పాటు జరుగనున్నాయి. పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగనున్న ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 20 వేల మంది ఉపాధ్యాయులు హాజరు కానున్నారు. ప్రతినిధి వర్గంగా సుమారు 1000 మంది పాల్గొంటారు. ఉపాధ్యాయ ఉద్యమానికి భవిష్యత్తు దిశ నిర్దేశం చేయడానికి సిద్ధమవుతున్నాయి. 2000 సంవత్సరంలో 15 వేల మందితో కాకినాడలో ఘనంగా రజతోత్సవాలను జరిపారు. మళ్లీ ఇప్పుడు 14 ఏళ్ల తర్వాత స్వర్ణోత్సవాలకు కూడా కాకినాడ వేదిక అయ్యింది. 1974లో మొదటి మహాసభలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించారు.

వివిధ సదస్సుల నిర్వహణ

తొలి రోజు మధ్యాహ్నం యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్ అధ్యక్షతన జరుగనున్న 'ప్రజా చైతన్య సదస్సు'ను ప్రముఖ రాజకీయ విశ్లేషకులు కె.నాగేశ్వర్ ప్రారంభిస్తారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులు ప్రసంగిస్తారు. సాయంత్రం యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన ఉద్యమ సదస్సు జరుగుతుంది. రెండో రోజు ఐక్య ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు ఎస్.కుమార్ రాజా అధ్యక్షతన జరుగనున్న 'సాహిత్య సదస్సు'ను ప్రముఖ సాహితీ విశ్లేషకులు తెలకపల్లి రవి ప్రారంభిస్తారు., సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు, కంగార మోహన్, ప్రముఖ కథా రచయిత ఎ.అప్పలనాయుడు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావులు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ కుసుమకుమారి అధ్యక్షతన జరుగనున్న 'మహిళ సదస్సు'ను ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శి ఎస్.అరుణ కుమారి ప్రారంభిస్తారు. ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలే, హైకోర్టు మాజీ న్యాయమూర్తి టి.రజని, ప్రముఖ సామాజిక కార్యకర్త కె.వసుంధర తదితరులు ప్రసంగిస్తారు. రెండో రోజు సాయంత్రం కాకినాడ నగర వీధుల్లో ఉపాధ్యాయుల మహా ప్రదర్శన జరగనుంది.

మూడో రోజు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. చివరి రోజు యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.ప్రభాకర వర్మ పర్యవేక్షణలో 50వ జనరల్ కౌన్సిల్ (నూతన కమిటీ) ఎన్నిక జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కాకినాడ చేరుకున్న జాతాలు

1974 యుటిఎఫ్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 16 విద్యా, వైజ్ఞానిక మహాసభలు వివిధ ప్రాంతాల్లో జరిగాయి. ప్రస్తుతం 17వ రాష్ట్ర యుటిఎఫ్ విద్యా, వైజ్ఞానిక మహాసభలు (స్వర్ణోత్సవాలు) కాకినాడ పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నుంచి జరుగనున్న నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన 16 ప్రాంతాల జాతాల జెండాలతో ఆయా ప్రాంతాల కార్యకర్తలు శనివారం సాయంత్రం కాకినాడ చేరుకున్నారు. ఈ సందర్భంగా జాతా జెండాలతో కాకినాడ నగరంలో ప్రదర్శన జరిపారు. నేడు జరగనున్న ప్రారంభ సమావేశంలో ఆయా 16 జాతా జెండాలను సమావేశం ఆవరణలో ఆవిష్కరిస్తామని యుటిఫ్ నాయకులు తెలిపారు.

నూతన శోభను సంతరించుకున్న కాకినాడలోని యుటిఎఫ్ భవనం

సభాస్థలి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు, బృందం

సైన్స్ అభివృద్ధితోనే ప్రపంచ భవిష్యత్తు

ప్రజాశక్తి - పి.గన్నవరం

సైన్స్ అభివృద్ధి తోనే ప్రపంచ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. పి.గన్నవరం హైస్కూల్ నందు శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను వారు ప్రారంభించారు. విద్యార్థుల లోని సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని వారు అన్నారు. హైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు గదులు, నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. వైజ్ఞానిక ప్రదర్శన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టు లలో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో డిఇఒ కాసిపూడి సూర్యనారాయణ, ఆర్‌డిఒ శ్రీకర్, డిఇఒ బాషా, నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, ఆరుమిల్లి లాల్ బాబు, పి.గన్నవరం ఎంపిపి నాగమణి, సర్పంచ్ బొండాడ నాగమణి, హైస్కూల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఎల్‌ఎ గిడ్డి, ఎంఎల్‌సి ఐవి

నూతన బస్సులను ప్రారంభించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - రాజోలు

స్థానిక ఆర్‌టిసి డిపో నందు అయిదు నూతన బస్సులను రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ జెండా ఊపి శనివారం ప్రారంభించారు. స్వయంగా ఆయన బస్సును డ్రైవ్ చేశారు. అనంతరం ఎంఎల్‌ఎ వరప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతనంగా రాజోలు డిపోలో ఈ ఐదు నెలల్లో మొత్తం 11 బస్సులు ప్రారంభించామన్నారు. ప్రయాణికులు సౌకర్యార్థం అదనపు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ దానమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, రాజోలు నీటిసంఘం డిసి పినిశెట్టి బుజ్జి, రాజోలు ఎంపిపి కేత శ్రీనివాస్, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, రాజోలు వైస్ ఎంపిపిలు పోలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరావు, శివకోటి సర్పంచ్ నక్కా రామారావు, జనసేన నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నాగేంద్ర ప్రసాద్‌కు విశిష్ట రైల్ సేవా పురస్కారం

ప్రజాశక్తి - మండపేట

గండి నాగేంద్ర ప్రసాద్ రైల్వే శాఖలో అందించిన విశిష్ట సేవలకు ఆయకు విశిష్ట రైల్ సేవా పురస్కారం లభించింది. విజయవాడ లో రైల్వే ఇంజినీర్ గా మండపేట పట్టణానికి చెందిన నాగేంద్ర ప్రసాద్ విధులు నిర్వర్తిస్తున్నారు. రైల్వే శాఖలో అందించిన విశిష్ట సేవలకు దక్షిణ మధ్య రైల్వేలో అత్యున్నతమైన విశిష్ట రైల్ సేవా పురస్కారాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ చేతులు మీదుగా శనివారం అందుకున్నారు. సికింద్రాబాద్ లో జరిగిన రైల్వే వారోత్సవాలలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. నాగేంద్ర ప్రసాద్ ను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్యాట్రన్ డాక్టర్ చల్లా రవి కుమార్, విజయ వాడ డివిజన్ రైల్వే స్కౌట్ అండ్ గైడ్ మాస్టర్ జి.రాజేంద్ర ప్రసాద్, వాణిజ్య పన్నుల శాఖ అధికారి జె.రాజేష్‌బాబు, అభ్యుదయ రచయితల సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్, ఇన్కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ తలారి అమరేంద్ర ప్రసాద్, జీవిత బీమా సంస్థ సైబర్ సెక్యూరిటీ అధికారి శేషు కుమార్, రైల్వే అధికారులు తదిరులు అభినందించారు.

పురస్కారం స్వీకరిస్తున్ననాగేంద్ర ప్రసాద్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

గ్రామస్థాయిలో భూవివాదాలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం ఆయన రామచంద్రపురం మండలం లోని నెలపర్తిపాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించి గ్రామస్థాయిలో గత నెల డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారని అన్నారు. అనంతరం మంత్రి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో డి అఖిల, రామచంద్రపురం తహసిల్దార్ ఎం.సావిత్రి, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గ్రామంలో నెలపర్తిపాడు నుంచి ద్రాక్షారామం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే బస్సును మంత్రి ప్రారంభించారు. నెలపర్తిపాడు గ్రామ ప్రజలందరూ ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్‌డిఒ డి.అఖిల, ఆర్టీసీ డిపిటిఒ శ్రీనివాస్, నెలపర్తిపాడు సర్పంచ్ రాయుడు సీతామాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేతల సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌సి గిడుగు రుద్రరాజు స్వగృహంలో శనివారం న్యూ ఇయన్ వేడుకలలో భాగంగా ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఎపిపిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం

రామచంద్రపురంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం నుంచి ప్రారంభమైంది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రామచంద్రపురం: పట్టణంలోని ఎస్‌కెపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనం పథకాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ శనివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1,68,412 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించడానికి ఈ విద్యా సంవత్సరానికి రూ.27.39 కోట్లను ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి వనుము సోమశేఖర రావు, రామచంద్రపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి. .శ్రీదేవి, రామచంద్రపురం ఆర్‌డిఒ డి.అఖిల, ఎస్‌కెపి ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వీరన్న, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం:** స్థానిక వెచ్చ వారి అగ్ర హారంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు, డిఆర్ఒ కె.మాధవిలు ప్రారంభించి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గండిహారిక, మెట్ల రమణబాబు ప్రజాప్రతినిధులు జూనియర్ కళాశాల లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు. **రాజోలు :** ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, టిడిపి పెద్దపురం నియోజకవర్గ పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ, రాజోలు నీటిసంఘం డిసి పినిశెట్టి బుజ్జి, రాజోలు ఎంపిపి కేత శ్రీనివాస్, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, రాజోలు వైస్ ఎంపిపి లు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు**: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, ఎస్ఎంసి ఛైర్మన్ వేగి శ్రీనివాస్, ఇంటి మహేంద్ర తదితరులు పాలుగున్నారు **కపిలేశ్వరపురం:** మండలంలోని అంగర, మాచర ప్లస్ టు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. అంగర జడ్‌పి ఉన్నత పాఠశాల ప్లస్ టు జూనియర్ కళాశాలలో 12 మంది విద్యార్థులకు గాను వివిధ కారణాల రీత్యా నలుగురు విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనం చేసినట్లు పాఠశాల హెచ్ఎం ఎ. రాజు తెలిపారు. అలాగే మాచర ఉన్నత పాఠశాల ప్లస్ టు లో 14 మంది విద్యార్థులకుగాను 13 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజన పథకంలో భోజనం చేసినట్లు పాఠశాల హెచ్ఎం రమాదేవి తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఎస్ఎంసి ఛైర్మన్లు, వైస్ ఛైర్మను తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొత్తపేట ఎంఎల్‌ఎ ఎమ్మెల్యే సత్యానందరావు, ఎంపి గంటి హరీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కెవి.సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు,వెలగల శ్రీనివాస్ రెడ్డి, పెచ్చేటి చిన్నారావు, కాస సాగర్, చవల జగన్నాధం, సిద్ధిరెడ్డి శ్రీను, పడాల బుల్లి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** నగర పంచాయతీపరిధిలో డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో ప్రిన్సిపల్ పి ఎల్.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆ పథకం అడిషనల్ కో ఆర్డినేటర్ సురేష్ ప్రారంభించారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అమలాపురం ఎంఎల్‌ఎ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాజోలు ఎంఎల్‌ఎ

రావులపాలెంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బండారు, పాల్గొన్న ఎంపి హరీష్

జొన్నాడ ఇసుక అక్రమాలపై తనిఖీ

జొన్నాడ ఇసుక ర్యాంపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

మైన్స్ విజిలెన్స్ శాఖ తనిఖీలు

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడలో ఇసుక అక్రమాల జోరుకు మైన్స్ అండ్ విజిలెన్స్ శాఖ శనివారం అడ్డుకట్ట వేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్థానిక ఇసుక ర్యాంపులో అనధికారికంగా ప్రభుత్వ పనుల పేరిట ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని పిర్యాదులు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు జిల్లా యంత్రాంగం స్పందించింది. ఉచిత ఇసుక విధానం దుర్వినియోగం అవుతుందని గ్రహించింది. దీంతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు మైన్స్ పీడీ ఎల్.వంశీధర్‌రెడ్డి నేతృత్వంలో మైన్స్ అధికారులు సి.సుజాత, ఎండీ.రెహమాన్ ఆలీ తదితరులు శనివారం స్థానిక ఇసుక ర్యాంపులో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అధికారుల రాకను ముందుగానే గ్రహించిన కూటమి నేతలు ఇసుక ర్యాంపును మూసివేశారు. దీంతో మైన్స్ అధికారులు ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. పరిమితికి మించి లోతుగా ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తవ్విన విధానాన్ని, అనధికారికంగా నిల్వ చేస్తున్న విధానాన్ని గుర్తించారు. ఈమేరకు స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి సమాచారాన్ని సేకరించి వివరాలను నమోదు చేసుకున్నారు.

ఇసుక గుట్టల సీజ్

జొన్నాడ ఏటిగట్టు దిగువన కాటా వద్ద అనధికారికంగా నిల్వ ఉంచిన ఇసుక గుట్టలను మైన్స్ అధికారులు సీజ్ చేశారు. ఇసుక నిల్వలకు ఏవిధమైన రశీదులు లేనందున, తదుపరి ఆదేశాలు వెలువడే వరకూ ఇసుక గుట్టలను యధాస్థానంలో ఉంచాలని ఆర్ఐ ఎం.రామాయమ్మ విఆర్ఒలను ఆదేశించారు. అక్రమ తవ్వకాలపై మైన్స్ ఆర్ఐ సుజాతను వివరణ కోరగా ఇసుక అక్రమ తవ్వకాలు జరగడం వాస్తవమేన న్నారు. తనిఖీలు నిర్వహించేందుకు వచ్చిన సమయంలో ఇసుక తవ్వ కాలు జరగడం లేనందువల్ల అక్కడ జరిగిన కార్యకలపాలపై వివరాలను నమోదు చేసుకుని రూపొందించిన నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ద్విచక్రవాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్ఐ సిహెచ్.రాజేష్ అన్నారు. .సిరిపల్లి-మునిపల్లి ప్రధాన ఆర్అండ్ బి రహదారిపై శనివారం గొల్లవిల్లిలో సన్నవిల్లి సెంటర్ వద్ద ద్విచక్ర వాహన చోదకులను ఆపి వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రతీ ద్విచక్ర వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్‌లు మాట్లాడవద్దని వాహన రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. అలాగే మితిమీరిన వేగంతో వాహనాల నడిపి ప్రమాదాలు కోరి తెచ్చు కోవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రయాణించి క్షేమంగా గమ్యం చేరుకోవాలని నిబంధనలు పాటించని వాహన చోదకులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ ఈ సందర్భంగా తెలిపారు.

వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

6 నుంచి పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా ఆరోగ్య పింఛన్ల తనిఖీ ప్రక్రియ ఈనెల 6 నుంచి ప్రారంభమై 25 వరకూ కొనసాగుతుందని అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీ ప్రక్రియలో వైద్య నిపుణలతో కూడిన బృందాలు పరిశీలించనున్నాయని అధికారులు తెలిపారు. ఈ బృందాలు జిల్లలో వారీగా కేటాయించిన మండలాలు/గ్రామాల్లో పర్యటించి, పింఛను దారుల అర్హత పరిశీలించి యాప్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు.

కార్టూ'నిజం'



రూపాయి విలువ పతనం!

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బ్రెయిలీ చిత్రపటాలకు నివాళులు అర్పించారు.

అమలాపురం: ప్రపంచంలోని అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని లూయిస్ బ్రెయిలీ ప్రసాదించి బావ ప్రకటన భావవ్యక్తీకరణకు అవకాశం కల్పించారని జిల్లా రెవెన్యూ అధికారి ఇన్‌ఛార్జి కె.మాధవి అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవన్ నందు లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని పుర స్కరించుకుని విభిన్న ప్రతిభా వంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఇన్‌ఛార్జి కె.మాధవి మాట్లా డుతూ బ్రెయిలీ లిపిని అభివృద్ధి చేసి ఎంతో మంది అంధులను విద్యా వేత్తలుగా, శాస్త్ర వేత్తలుగా, చిత్రకారులుగా అనేక రంగాల్లో బ్రెయిలీ లిపితో అగ్రభాగాన నిలిచేట్లు చేసిన లూయిస్ బ్రెయిలీ అంధుల అక్షర ప్రదాతగా ఎన్నటికీ వెలుగొందుతూనే ఉంటార న్నారు. అంధుల అక్షర శిల్పి బ్రెయిలీ అంధులు సైతం సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిందేనన్న ఆశయంతో వారి భావవ్యక్తీకరణ, బావ ప్రకటన, విద్యార్జన కోసం ప్రత్యేక లిపిని రూపొందించారన్నారు. అనంతరం. ప్రభుత్వం ముద్రించిన బ్రెయిలీ క్యాలెండర్ ను ఆవి ష్కరించారు. అంధులకు ట్రై సైకిళు,, జడ్‌పిటిసి సభ్యుడు మోటూరు వెంక టేశ్వరరావు సమకూర్చిన దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఇన్‌ఛార్జి వివిఎస్.లక్ష్మణరావు, హరి మనోవికాస కేంద్రం ఛైర్మన్ రాజశేఖరరావు, అంధుల వికలాంగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** స్థానిక భవిత కేంద్రంలో శనివారం బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ సత్తి సత్య కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే ఇటీవల వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సూదా లక్ష్మీనారాయణ మతి చెందారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఎంఇఒ సత్య కష్ణ మాట్లాడుతూ దష్టి లోపం గల పిల్లల్లో అనేక సామర్థ్యాలు ఉంటాయని వాటిని వెలికి తీసి సాన పెట్టడం ద్వారా వారికి మంచి భవిష్యత్తు ఇవ్వవచ్చని అన్నారు. బ్రెయిలీ జయంతి సందర్భంగా దష్టిలోపం ఉన్న పిల్లలచే పుట్టినరోజు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో జిహెచ్ఎం, ఎల్.రాణి, ఎస్ఎ ప్రత్యేక ఉపాధ్యాయుడు వై.అజయ్ కుమార్, ఐఇఆర్‌పిలు సిహెచ్.గంగాదేవి, పి.వెంకటేష్, ఎంఆర్‌సి సిబ్బంది బద్రి జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో వికలాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

ఉప్పలగుప్తం భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపిపి అంబటి భవాని అధ్యక్షతన ఈ సమావేవం నిర్వహించారు. సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ 327 రకాలు వ్యాధులకు ఎన్‌టిఆర్ వైద్య సేవలు అందజేస్తున్నారని అన్నారు. 40 పిహెచ్‌సిలు ఆరోగ్య సేవలు అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ ఆపరేషన్లకు, మత్తు డాక్టర్‌కు రూ.6వేలు, శిశువులను ఇంక్యూబేటర్లో పెట్టాలంటూ రూ.10వేలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టణంలో గల ఆరోగ్యశ్రీ ఆసుపత్రులను ఇదే విధానం కొనసాగుతోందన్నారు. ఆరోగ్యశ్రీ రోగులకు నుంచి అదనపు వసూళ్లు చేయకుండా చర్యలు చేపట్టాలని సభ్యులు తీర్మానించారు. పలు సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా ప్రతినిధులపై అధికారులు తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని వెంకటా యపాలెం సర్పంచ్ యెల్లమెల్లి సతీష్ కుమారి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపిడిఒ పద్మజ్యోతి, జడ్‌పిటిసి మెర్ని వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు నరాల రాజ్యలక్ష్మి, పలువురు అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పాల్గొన్న ఎంపిపి భవాని తదితరులు

పాలకులు మారినా.. మారని పాలన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పాలకులు మారినా పాలన మారలేదనే అభిప్రాయం స్వత్రా వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం కొలువు దీరి 6 నెలలు గడిచిన విషయం విధితమే. గోదావరి ఒడ్డున్న ఉన్నప్పటికీ సామాన్యులకు ఇసుక అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు 4 రెట్లు అదనంగా విక్రయాలు జరుగుతున్నాయి. అక్రమార్కులకు కళ్లెం వేస్తామంటూ గత నెలలో కొన్ని రీచ్‌లను అధికార యంత్రాంగం చేసిన హడావుడి నేతి బీర చందంగా మారింది. తెరవెనుక రాజకీయ పెద్దలు చక్రం తిప్పటమే ఈ దుస్థితికి కారణమని తేటతెల్లమౌతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను ఎండగడతామంటూ ప్రకటించిన కూటమి నేతలే తిరిగి అక్రమాలు, అవినీతికి పాల్పడటం విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా ఇసుక సరఫరాపై దృష్టి సారించి సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమ వుతోంది. అదే విధంగా సూపర్ సిక్స్ పేరుతో కూటమి ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తు న్నారు. నూతన సంవత్సరంలోనైనా ప్రభుత్వం ఆ దిశ గా అడుగులు వేయాలని ప్రజలు ఎదురు చూస్తు న్నారు.

గజ.. గజ..

రాత్రి ఉష్ణోగ్రతలు క్రమ క్రమంగా పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరిగింది. ఫలితంగా ప్రజారోగ్యంపైనా ప్రభావం పడుతోంది. గత వారం రోజులుగా జ్వర పీడితుల సంఖ్యా రోజు రోజుకీ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్ర ఆస్పత్రులకు తరలి వస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ ఆస్పత్రులతో పాటు అమలాపురం ఆస్పత్రిలోనూ ఔట్‌పేషెంట్స్‌తో పాటు ఇన్ పేషెంట్స్ సంఖ్యా పెరిగింది. ప్రభుత్వ ఆస్పత్రులల సౌకర్యాల లేమి వెంటాడటంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వివిధ రకాల టెస్టుల పేరుతో అస్పత్రుల యాజమాన్యాలు రోగుల

గోదారి గలగలలు

జేబులకు చిల్లు పెడుతున్నాయి. సీజనల్ వ్యాధుల రీత్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులు సౌకర్యాలు మెరుగుపర్చితే కొంత మేర భరోసా లబించే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికులపై పండుగభారం

ప్రయాణికులపై పండుగ భారం పడుతోంది. క్రిస్‌మస్, న్యూఇయర్‌లతో పాటు సంక్రాంతి నేపథ్యంలో బస్సులు, రైళ్లలో రాకపోకలు పెరిగాయి. పెరిగిన రద్దీకి అనుగుణంగా ఆర్‌టిసి బస్సులు పెంచినప్పటికీరిజర్వేషన్‌లు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రయాణీకులు ప్రైవేట్ ఆపరేటర్లను ఆశ్రయించక తప్పడం లేదు. సాధారణ చార్జీలకు మూడు రెట్లు అదనంగా వసూలు జరుగుతోంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి అదనంగా వసూలు చేసే ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రయాణ అవసరాలకు తగ్గట్లుగా సర్వీసులు పెంచాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

సమరోత్సాహంతో మహాసభలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిపిఎం నిర్వహిఒచిన మహాసభలు ఆ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపాయి. గత మూడేళ్లలో నిర్వహించిన ఉద్యమాలను సమీక్షించుకోవటంతో పాటు భవిష్యత్తుకార్యచరణను ఈ మహాసభలు దిశా నిర్దేశం చేయాయి. గడచిన 6 నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత మూట గట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలపై ఈ మహాసభలలో నాయకులు ఎండగట్టారు. పాలకుల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమరశంఖం పూరించారు.

నేరాలు ఘోరాలు

దాడి కేసుపై విచారణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

తాళ్ల పొలం వద్ద దళిత యువకుడు పండు రమేష్ పై దాడి చేసి మోటార్ సైకిల్ దహనం చేశారన్న కేసు పై రామచంద్రపురం ఇన్‌ఛార్జి డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ శనివారం విచారణ చేపట్టారు. సంఘటనా స్థలంలో కాలిన మోటార్ సైకిల్ ఆయన పరిశీలించారు. అదేవిధంగా కేసు విచారణలో భాగంగా పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ద్రాక్షారామం పోలీసులు ఉన్నారు. ఇది ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కావడం వల్ల తాను దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డిఎస్‌పి వివరించారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలోని కొండారు పేటకు చెందిన గడ్డం అర్జున్ నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో 200 కేజీల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందుస్తుగా వచ్చిన సమాచారంతో శనివారం కిరాణా దుకాణంను తనిఖీలు చేయగా 10 బస్తాల్లో పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించామని సిఐ ఎం.గీతావిశ్వనాథ్ తెలిపారు. సంబంధిత సమాచారాన్ని తహశీల్దార్‌కు ఇచ్చి స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులకు అందజేసినట్లు తెలిపారు. అందజేయడం జరిగిందని అన్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం సుమారు 200 కేజీలు ఉన్నాయని తహశీల్దార్ జివిఎస్.ప్రసాద్ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి - శంఖవరం

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు. శనివారం మండపం సెంటర్లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. చింతపల్లి అటవీ ప్రాంతం నుంచి చెన్నైకి 9.115 కేజీల గంజాయిని తరలిస్తుండగా మహబూబ్‌నగర్‌కు చెందిన గంజి నరసింహం, కాంచీపురంకు చెందిన రామచంద్రలను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయితోపాటు, ద్విచక్రవాహనాన్ని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి పెద్దాపురంలో సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. అలాగే సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఇద్దరు ముద్దాయిలను కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చిట్టిబాబు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నల్లజర్ల

పోతవరంలో బస్సు కోసం ఎదురు చూస్తున్న మహిళను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి స్థానికులు 108లో కొయ్యలగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దేవరపల్లి మండలం త్యాజంపూడికి గుమ్మడి సుబ్బలక్ష్మి శనివారం పనికి వెళ్లే క్రమంలో బస్సు కోసం వేచి చూస్తుండగా ఒక ట్రాక్టర్ డ్రైవర్ మద్యం సేవించి మితిమీరి వేగంతో నడపడంతో ఒక బైకును ఢీ కొట్టి అనంతరం సుబ్బలక్ష్మిని ఢీకొన్నాడు. సుబ్బలక్ష్మికి చేతి గూడ జారిపోవడంతో పాటు తలకు బలమైన గాయం అయ్యింది. ఆబమె పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమండ్రిలోని జిఎస్ఎల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నీటి పక్షుల గణనపై శిక్షణ

ప్రజాశక్తి - తాళ్ళరేవు

అంతర్జాతీయ నీటి పక్షుల గణనపై శిక్షణా కార్యక్రమం కోరంగి బయోడైవర్సిటీలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగింది. పక్షుల గణనకు బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ, బర్డ్స్ వాచర్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, డెక్కన్ బర్డ్స్ హైదరాబాద్, ఎడబ్ల్యుసిఎస్, డబ్ల్యుఐ. వంటి సంస్థలతోపాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు ఈ పక్షుల గణన చేపట్టనున్నారు. పక్షులను గుర్తించడం, గణన చేయడం, పక్షుల గణన ఉపయోగాలపై నిర్వహించిన శిక్షణ అవగాహన సదస్సులో నీటి పక్షులను వాటి రంగు, లక్షణాలు, ఏ జాతి పక్షిని ఏ విధంగా గుర్తించాలి అనే విషయాలను నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఎపి. స్టేట్ కోఆర్డినేటర్ శ్రీరామ్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్, రీసెర్చ్ సైంటిస్ట్ మహేష్ తదితరులు పర్యవేక్షిస్తారు.

మండల స్థాయి శిక్షకులకు శిక్షణ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో శనివారం బిహెచ్ఎస్ఆర్ అండ్ విఎల్ఎం డిగ్రీ కళాశాలలో కిశోరి వికాసం మండల స్థాయి శిక్షకులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐసిడిఎస్ పీడీ విజయకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు, వాటివల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. బాలలపై అకృత్యాలు, శిక్షలు వాటి వల్ల అనర్థాల గురించి సిడిపిఓ నాగలక్ష్మి వివరించారు. డిసిపిఓ రాజ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, నేరమని సమాజంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే కచ్చితంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా సరే బాల్యవివాహాలు జరిగితే సమాచారం తెలియ చేస్తే వివరాలు గొప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తశీల్దారు రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ వేణుగోపాలరెడ్డి, విజయనిర్మల, ఎంఇఒ తిరుమలదాసు, ఉపాధ్యాయులు ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్లో శనివారం వడ్లమూరు జడ్‌పి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ విద్యార్థులకు భౌతిక శాస్త్రానికి సంబంధించిన యాసిడ్స్, బేసెస్, సాల్ట్ లతో ప్రాక్టికల్స్, ఆటో ట్రాఫిక్ న్యూట్రిషన్, ఎటిరోపిక్, కిరణ జన్య సంయోగ క్రియ తదితర అంశాలపై ప్రయోగాలు చేయించారు.

అవినీతికి చిరునామా మాజీ మంత్రి వేణు

కె.గంగవరం మండలం బడ్జెట్ సమావేశంలో మంత్రి సుభాష్

ప్రజాశక్తి - కె.గంగవరం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రాష్ట్రంలో ఎక్కడ లేని అవినీతి రామచంద్రపురం నియోజకవర్గం లో జరిగిందని, అవినీతికి చిరునామా మాజీ మంత్రి వేణు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. కె. గంగవరం మండలం బడ్జెట్ సమావేశం ఎంపిపి పంపన నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రామచంద్రపురం నియోజకవర్గంలో ల్యాండ్ ఫిల్లింగ్‌లో తీవ్ర అవినీతి జరిగిందని, అవినీతి పరిపాలన అందించిన అప్పటి మంత్రిగా వేణు ప్రసిద్ధిగాంచారన్నారు. అవినీతిపై విచారణ జరిపిస్తామని విజిలెన్స్ విచారణ జరుగుతుందని మంత్రి సుభాష్ వివరించారు. మసకపల్లి ప్రాంతంలో మట్టి వేయకుండా రూ.ఏడు లక్షలు డ్రా చేశారని సమావేశంలో రవ్వ భూషణం మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలన్నారు. మంత్రి ఎంక్వయిరీ చేస్తామని హామీ ఇచ్చారు. రూ. 10 లక్షలు విలువ చేయండి భూములకు కూడా అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేశారని మూడు అడుగులు శ్మశానం దారి కూడా వదలకుండా లేఔట్లు వేశారని ఆయన విమర్శించారు. కొన్నిచోట్ల పట్టాలి ఇచ్చి స్థలాలు చూపించలేదన్నారు. కాజులూరు లో నలుగురు కాంట్రాక్ట్ చేసిన పనికి మొదటి విడతగా ఏడు లక్షలు మంజూరు కాగా మిగిలిన రూ.26 లక్షలు వేరే అకౌంట్ లోకి మళ్ళించారని దీనిపై కేసు నమోదు దోషులు పట్టుకోవాలన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో డంపింగ్ యార్డు శ్మశాన రోడ్లు సమస్య అధ్వానంగా ఉందని దీనిపై అధికారులు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేయాలి అన్నారు. అదేవిధంగా గుంతలు లేని రోడ్ల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని కె.గంగవరం మండలంలో మూడు కోట్లతో గుంతలు పూడ్చే కార్యక్రమం జరుగుతుందన్నారు ప్రస్తుతం అభివద్ధి కార్యక్రమాలపై దష్టి సారించి నియోజకవర్గం అభివద్ధి పథంలో నడిపేందుకు కషి చేస్తున్నామని దీనికి అధికారులు ప్రజాప్రతినిధులు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసు, తహశీల్దార్ బి.మృత్యుంజయరావు, జడ్‌పిటిసి సభ్యురాలు ఓబులనే వరలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు నీతి పూడి మధుబాల, దూడల నాగేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జనసేన నాయకునికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి -మామిడికుదురు

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అప్పనపల్లి కి చెందిన జనసేన సీనియర్ నాయ కుడు తులా బ్రహ్మాజీని పి.గన్న వరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనా రాయణశనివారం పరామర్శిం చారు. బ్రహ్మాజీకి పార్టీ అండగా నిలుస్తుందని ఎంఎల్ఎ అన్నారు. బ్రహ్మాజీని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. ఆయన వెంట మండల జనసేన మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, కంకిపాటి నరసింహారావు, తులా గోపాల కృష్ణ, మేడేపల్లి సత్తిబాబు, తులా ఆది, మంద గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్దాల బ్లడ్‌బ్యాంకు వార్షికోత్సవం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురంలోని బుద్దాల బ్లడ్‌బ్యాంక్ వార్షికోతవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో బ్లడ్, ప్లేట్‌లెట్స్ కావాలంటే రాజమహేంద్రవరం, భీమవరం వెళ్లవలసిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ పరిస్థితుల్లో బుద్దాల బ్లడ్ బ్యాంక్ ద్వారా అనేకమందికి రక్తదానం చేయడం అభినందనీయమనిఅన్నారు. కోనసీమలో చుట్టూ వున్న ప్రాంతాల్లో ఉన్న రోగులు రక్తం కొరత వలన ప్రాణాలు విడిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అప్పటికే తణుకులో బ్లడ్ బ్యాంక్ ద్వారా సేవలు అందిస్తున్న బుద్దాల నరసింహారావు (నాని) దృష్టికి ఈ విషయం వెళ్లడంతో రక్తం కొరత వలన ఎవరు చనిపోకూడదనే ఉద్దేశ్యంతో 2015 లో బుద్దాల నాగరత్నం మెమోరియల్ బ్లడ్ సెంటర్ స్థాపించారన్నారు. కోనసీమ ప్రాంత వాసులకు బ్లడ్, ప్లేట్ లెట్స్, ప్లాస్మా, అత్యాధునిక టెక్నాలజీతో సేవలను అందించి ఆయన ఉత్తమ పురస్కారాలు అందుకున్నారని కొనియాడారు. కోనసీమ ప్రాంతంలో నే కాకుండా ఉభయ గోదావరి జిల్లాల్లో తణుకు, తాడేపల్లిగూడెం, విశాఖపట్నంలో గాజువాక, జగదాంబ, రాజమహేంద్రవరం, బొబ్బిలితో సహా ఏడు బ్లడ్ సెంటర్ ద్వారా బ్లడ్ సేవలను అందిస్తూ ఎందరో ప్రాణాల్ని కాపాడుతున్న నరసింహారావును పలువురు అభినందించారు.

కిశోరి వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి - రాజోలు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసిడిఎస్ సిడిపిఒ వైడికె.రమాదేవి ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాటిపాక పిహెచ్‌సి వైద్య అధికారిణి దివ్య దర్శిని పాల్గొని 11 నుంచి 18 సంవత్సరాల లోపు బాలికలు ఎదుర్కొనే సమస్యలు, తీసుకోవలసిన పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సిడిపిఒ రమాదేవి మాట్లాడుతూ కిశోరి బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిపి కేతా శ్రీనివాస్, వైస్ ఎంపిపిలు ఇంటిపల్లి ఆనంద రాజు, పొలమూరి శ్యాంబాబు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్ సందర్శించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సరస్వతి, క్రాంతి, బాలా త్రిపురసుందరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** కౌమార దశలో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్ కు కిశోరి వికాసం దోహదం చేస్తుందని మండల అభివృద్ధి అధికారి టిఎస్.వెంకటా చార్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు ఐసిడిఎస్ సిడిపిఒ విమల కుమారి అధ్యక్షతన శనివారం మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి యోగితా లక్ష్మి, నగర పంచాయతీకమిషనర్ పి.రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.



బహుమతిని అందజేస్తున్న ఎంఎల్ గిడ్డి సత్యనారాయణ

వైజ్ఞానిక ప్రదర్శనలో 'గోడి' విద్యార్థినికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - అల్లవరం

జిల్లా స్థాయిలో నిర్వహించిన విద్యా వైజ్ఞాన ప్రదర్శనలో అల్లవరం మండలం గోడి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిమ్యాజిక్ అంబ్రెల్లా ప్రాజెక్ట్ ఈవెంట్‌లో మొదటి బహుమతిని సాధించింది. ప్రథమ స్థానంలో నిలిచిన శాల్వినను, ప్రిన్సిపల్ కిరణ్మయ్ , గైడ్ టీచర్ కె.మౌనిక ను ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి కె మాధవి, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, మండల విద్యా శాఖ అధికారులు కె కిరణ్ బాబు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్వేది ఉత్సవ కమిటీ చైర్మన్‌గా బాలాజీ

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు ఎంఎల్ఎతో బాలాజీ

నఖినేటి వల్లి మం డలంలోని ఉన్న అంతర్వేది దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా జనసేన సీనియర్ నాయకులు, పార్టీ రాష్ట్ర సం యుక్త కార్యదర్శి దిరిశాల బాలాజీ ఎంపిక య్యారు. జన సేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహ రిస్తున్న బాలజీని ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయడంపై రాజోలు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్‌కు కృతజ్ఞ తలు తెలిపారు. అంతర్వేది ఉత్సవాలు విజయవంతంగా జరగడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

భీమేశ్వరుని దర్శించుకున్న కాకినాడ జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కాకినాడ జిల్లా విక్రమ్ పాటిల్ ద్రాక్షారామ భీమేశ్వర స్వామిని శనివారం దర్శించుకున్నారు. సతీ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకున్న పూజలు నిర్వహించారు. స్వామి దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్య క్రమంలో రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

నీటి సంఘాల సేవలు రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - ఆలమూరు

నీటి సంఘాల సేవలు అనునిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. పెదపల్లలో ఇటీవల నూతనంగా ఎన్నికైన చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్ చౌదరి నివాసంలో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్, పద్మజ దంపతులు బండారు శ్రీనివాసును సత్కరించారు. నీటి సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన గారపాటిని ఈ సందర్భంగా బండారు శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గారపాటి త్రిమూర్తులు, మండల జనసేన అధ్యక్షులు సూరపురెడ్డి సత్య, సలాది జయప్రకాష్ నారాయణ, ఎన్నార్ై రాయుడు వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, బైరిశెట్టి రాంబాబు, సురేష్, లక్ష్మణరావు, గణేష్, కనకయ్య, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

నియోజకవర్గంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య లేకుండా చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. నర్సిపూడిలో రూ. 8 లక్షలతో నిర్మించిన అభివృద్ధిపనులకు ఆయన శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, ఎఎంసి మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్, సర్పంచ్ కండిబోట్ల శ్రీను, ఎంపిటిసి సభ్యుడు మేడిశెట్టి సుబ్బారావు, మాజీ ఎఎంసి చైర్మన్ దున్నే స్వామినాయుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రాయుడు బాబ్జి, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



నర్సిపూడిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు

సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బాలాజీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహిచారు. ఈ వేడుకల్లో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోగి మంటలు వేశారు. రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులతో కోలాటం వంటి పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటలు నిర్వహించి వేడుకలు నిర్వహించారు. .ఈ సంబరాల్లో పాఠశాల కరెస్పాండెంట్ పి.సుజాత, వ్యవస్థాపకులు పివిఎస్.శాస్త్రి, హెచ్ ఎం.రామరాజు, సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆటల పోటీలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జనవరి 7,8, 9 తేదీలలో నిర్వహించే మండల స్థాయి ఆటల పోటీలు విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి టిఎస్. వెంకటాచారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నగర పంచాయతీపరిధిలోని జిల్లా పరిషత్ బాలికలు, బాలురు మరియు డాక్టర్ ఎంజిఆర్ కళాశాల క్రీడా ప్రాంగణం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ నోటీసులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

గోదావరి గట్టుపై శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి అలక్ష్యం వహించరాదని శానిటేషన్ విభాగం అధికారులను కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. వార్డు తనిఖీల్లో భాగంగా శనివారం కోటిలింగాల ఘాట్‌ను పరిశీలించారు. పారిశుధ్య లేమి పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి రోజు అనేక మంది గట్టుపైకి వచ్చి సేద తీరుతుంటారని యిక్కడ పరిస్థితులు వారికి అసౌకర్యంగా ఉండకూడదని నిబద్ధతతో పనిచేసి శానిటేషను పరిస్థితులు మెరుగ్గా ఉండేలా చూడాలని ఆదేశించారు.

అపరాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

అపరాల సాగుపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై శనివారం మండ లంలోని ఎ.విజయనగరం, దుర్గాడ గ్రామాల రైతులకు అవగాహన నిర్వహించారు. రైతులు రెండో పంటగా వేస్తున్న మినుం పంటపై తీసుకోవాల్సిన సస్యరక్షణ గురించి పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎ.సీతారామశర్మ, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి వివరించారు.

అసంపూర్తి భవనాల నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

వివిధ గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలిన వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు నర్సిపూడిలో అసంపూర్తి భవన స్థితిగతులను శనివారం ఆయన స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో కొన్ని అసంపూర్తిగా నిర్మించి ఆగిన భవనాలు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఈ భవనాలను వాటి స్థితిగతులను బట్టి ఇంజినీరింగ్ అధికారులు ఎస్టిమేట్లు తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కండిబోట్ల శ్రీను, ఎంపిటిసి సభ్యుడు మేడిశెట్టి సుబ్బారావు, మాజీ ఎఎంసి చైర్మన్ దునే స్వామి నాయుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రాయుడు బాబ్జి, కూటమి నేత ఉండమట్ల బాలాజీ, మాజీ సర్పంచ్ గుత్తుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి కాపురస్తులు **వనం సత్యనారాయణ గారి కుమారుడు వనం వెంకటరమణ** వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు యొక్క చిన్న కుమారుడు వనం సతీష్‌కుమార్ చెడు వ్యసనములకు లోనయి గత కొద్ది సంవత్సరముల నుండి అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని ఉన్నాడు. అటులనే చాలా బ్యాంకుల నుండి పర్సనల్ లోనులు, బిజినెస్ లోనులు, క్రెడిట్ కార్డ్ లోన్స్‌గా చాలామంది వద్ద తన సొంత అవసరముల కోసం అప్పులు చేసి ఉన్నారని నా క్లయింటుకు తెలియ వచ్చినది. సదరు వనం సతీష్‌కుమార్ చేసిన బాకీలకు నా క్లయింటుకు ఏవిధమైన సంబంధం లేదు. నా క్లయింటు కుమారుడు వనం సతీష్‌కుమార్ చేసినటువంటి బాకీలకు నా క్లయింటు ఎన్నడు హామీ గాని, జామీన్ గాని పెట్టి ఉండలేదు. కావున సదరు నా క్లయింటు కుమారుడు గత రెండు (2) నెలలు నుండి ఇంటికి కూడా రావడంలేదు. నా క్లయింటు కుమారుడు చేసినటువంటి బాకీలు వసూలు నిమిత్తంగా నా క్లయింటు యొక్క ఇంటికి గాని, షాపునకు గాని ఎవరైన వచ్చి పరుష పదజాలం ఉపయోగించిన నా క్లయింటును ఏ రూపంలో బెదిరించినా నా క్లయింటు సదరు వ్యక్తులపై లేక సంస్థలపై లేక సంస్థల యొక్క ఏజెంట్లుగా తెలియపర్చుకొని ఇంటికి వచ్చిన వారిపై నా క్లయింటు తగు సివిల్ మరియు క్రిమినల్ చట్టపరమైన చర్యలు తీసుకొందురు అని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

కె.జగదీష్‌కుమార్
అడ్వకేట్, రాజమండ్రి
రాజమండ్రి
04-01-2025

పాస్‌పోర్టు పడిపోయినది

కాజులూరు మండలం బంధనపూడి గ్రామానికి చెందిన గుజ్జారపు రత్నసునీతకు చెందిన పాస్‌పోర్టు నెం:**K.2289893** గల పాస్‌పోర్టు 15-09-2024 కాకినాడ నుండి యానం వచ్చు చుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌నందు సంప్రదించవలెను.

గుజ్జారపు సునీత
C/o.నెక్కంటి శ్రీ కృష్ణా మాధవరావు
డోర్ నెం.2-20-3, బంధనపూడి గ్రామం
మెగలిపాలెం, కాజులూరు మండలం
కాకినాడ జిల్లా, సెల్ : 9502527777

జనరల్ నోటీస్
సీనియర్ సివిల్ జడ్జి పెద్దాపురం వారి కోర్టులో
SOP.No.3/2024

Between
మంతెన లక్ష్మీ సౌజన్య మరియు తదితరులు ...పిటిషనర్
(లేరు) ...రెస్పాండెంట్

వారసత్వ సర్టిఫికెట్ నోటీసు

పైన తెలిపిన పిటీషనర్‌కు (లేటు) మంతెన శ్యామలాదేవి గారు వ్రాసిన వీలునామా ద్వారా వారసుడు అయి, ఆవిడ మరణానంతరము ఆవిడ సేవింగ్స్ అకౌంట్ ఖాతాలో నిల్వను తీసుకొనుటకు, అలాగే ఆవిడకు సంబంధించిన ఎంప్లాయిస్ బెనిఫిట్స్‌ను పిటీషనర్ తీసుకొనుటకు ఎవరికైన అభ్యంతరాలున్నచో సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో (పెద్దాపురం) ఉదయం **10.30** గం॥నుండి సాయంత్రం 5గం॥ లోపుగా తెలుపగలరు. అని ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది. లేనిచో కోర్టు వారు తదుపరి ఆర్డరు జూరీ చేయుదురు
(ఇది శ్రీ కోర్టు ఆర్డరు ప్రకారం జారీ చేయబడిన నోటీసు)

R.VENKATA REDDY
Advocate, Prathipadu.
పెద్దాపురం
03-01-2025

ప్రకటన

కాకినాడ జిల్లా సామర్లకోట పట్లణానికి చెందిన **గుత్తుల రాజ రాజేశ్వరి** W/o. నాగేశ్వరరావు (లేటు) తెలియజేయునది ఏమనగా నా అసలు పేరు గుత్తుల రాజ రాజేశ్వరి. అలాగే **గుత్తుల రాజేశ్వరి** అని కూడా నన్ను పిలుస్తుంటారు. ఈ రెండు పేర్లు నా ఒక్కరికే చెంది వేరే వ్యక్తికి కానివై వున్నవి. వీటికి ఎవరికైనా అభ్యంతరం వున్న ఎడల ఈ ప్రకటన వెలువడిన వారం రోజులు లోగా అభ్యంతరాలు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయవలసిందిగా యావన్మందికి తెలపడమైనది.

గుత్తుల రాజరాజేశ్వరి
W/o. నాగేశ్వరరావు, D.No.3-8-10,
కుమ్మరి వీధి, సామర్లకోట,
కాకినాడ జిల్లా, సెల్ : 9052254811

NOTICE
IN THE COURT OF THE VIIth ADDITIONAL DISTRICT JUDGEPEDDAPURAM
I.A.No. 223 of 2023 in O.S.No. 36 of 2023

Between:
Batcha Aravala Raju .. **Plaintiff/Petitioner**
AND
1. Bandaru Rajiv Kumar
2. Medicharla Saisatya Saharash
(2nd Defendant being Minor represented by Guardian 1st Defendant)
..**Defendants/Respondents**

TO,
2nd Defendant/Respondent: Medicharla Saisatya Saharsh S/o Late Medicharla Swetha Haritha , aged 7 years, D.No.5-107, Ramachandrapuram village hamlet of Tamarada Village, Thamarada post, Kirlampudi Mandal, Prathipadu JCJ
[**2nd Defendant/Respondent** being Minor represented by Guardian i.e., **1st Defendant /Respondent** i.e, Bandaru Rajiv Kumar S/o Late Bandaru Suresh Kumar, aged 41 years, D.No.5-107, Ramachandrapuram village hamlet of Tamarada Village, Thamarada post, Kirlampudi Mandal, Prathipadu JCJ]
Whereas the Plaintiff/Petitioner filed the above I.A.223 of 2023 against you and Hon'ble Court ordered notice to you in the I.A, you evaded to receive notice in I.A.223 of 2023. The Hon'ble VIIth Additional District Judge, Peddapuram ordered notice to you by Publication and hence you are hereby called upon to appear before the court on 09/01/2025 at 10.30 A.M and if you fail to do so I.A.223 of 2023 will be decided in your absence

ADVOCATE FOR PLAINTIFF
Varanasi Veerabhadra Rao
Advocate, Peddapuram
Mobile: 9059038580

SUMMONS
IN THE COURT OF THE VIIth ADDITIONAL DISTRICT JUDGE PEDDAPURAM
O.S.No. 36 of 2023

Between:
Batcha Aravala Raju ...**Plaintiff**
AND
1. Bandaru Rajiv Kumar
2. Medicharla Saisatya Saharash
(2nd Defendant being Minor represented by Guardian 1stDefendant) ..**Defendants**

TO,
2nd Defendant: Medicharla Saisatya Saharsh S/o Late Medicharla Swetha Haritha, aged 7 years, D.No.5-107, Ramachandrapuram village hamlet of Tamarada Village, Thamarada post, Kirlampudi Mandal, Prathipadu JCJ
[2nd Defendant being Minor represented by Guardian i.e., 1st Defendant i.e, Bandaru Rajiv Kumar S/o Late Bandaru Suresh Kumar, aged 41 years, D.No.5-107, Ramachandrapuram village hamlet of Tamarada Village, Thamarada post, Kirlampudi Mandal, Prathipadu JCJ]
Whereas the Plaintiff filed the above suit against you for specific performance and other reliefs and Hon'ble Court ordered suit summons in the suit, you evaded to receive summons in the Suit. The Hon'ble VIIth Additional District Judge, Peddapuram ordered service of summons to you by Publication and hence you are hereby called upon to appear before the court on 09/01/2025 at 10.30 A.M and if you fail to do so the suit will be decided in your absence

ADVOCATE FOR PLAINTIFF
Varanasi Veerabhadra Rao
Advocate, Peddapuram
Mobile: 9059038580

గ్రామపంచాయతీ కార్యాలయం, గాడిమొగ

కొటేషన్ ప్రకటన

రి.క. నెం. /2024 తేది.17-12-2024

ది.23.12.24 సంవత్సరం తేదీ సోమవారం మధ్యాహ్నం 1.00 నుండి 2.00 గంటల సమయం నుందు కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం గాడిమొగ గ్రామపంచాయితీకి అవసరమైన ఈ క్రింది వివరించిన యంత్ర సామాగ్రి మరియు ఆటోమొబైల్స్ వాహనములు కొటేషను ద్వారా సప్లై చేయుటకు కొటేషన్ కోరబడుచున్నవి. సదరు కొటేషన్లును గాడిమొగ గ్రామపంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారికి అందజేయవలెననియు మధ్యాహ్నం 2.00 గంటలకు సమయంన వచ్చిన కొటేషన్లు స్వీకరించబడునునియు పంచాయితీకి వచ్చిన కొటేషన్లు కొటేషన్ దారుల సమక్షములో తక్కువ కొటేషన్ ఎంపిక చేసి శ్రీ జిల్లా పంచాయితీ అధికారి కాకినాడ జిల్లా కాకినాడ వారి నుండి అనుమతి ఉత్తర్వులు పొంది వర్క్ ఆర్డర్ ఇవ్వబడుననియు సప్లై చేయు కొటేషన్ దార్లకు పంచాయితీ నిధుల లభ్యతను బట్టి సొమ్ము ఈ గ్రామపంచాయితీ సాధారణ నిధుల నుండి చెల్లించబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు

వ.నెం.	యంత్ర సామాగ్రి/ఆటోమొబైల్ వాహనం	సప్లైచేయు సంఖ్య
1	2024-2025 సం.నకు అవసరమైన 63 కెవి జనరేటర్లు సరఫరా	2
2	2024-2025 సం.నకు వాటర్ ట్యాంకర్లు 5000 లీటర్లు కెపాసిటీ గలవి సరఫరా	2
3	2024-2025 సం.నకు వాటర్ ట్యాంక్ ట్రైర్లు సరఫరా	4

సం/- **శ్రీమతి కామాడి గోవ లక్ష్మి**
సర్పంచ్, గ్రామపంచాయితీ, గాడిమొగ
కాకినాడ జిల్లా

సం/- **కె.వెంకటరత్నం**
గ్రామపంచాయితీ, గాడిమొగ
కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం